కథ

# ప్రేమ రోగమా?

వీరాజీ

ఆ రోజు ఆఖరి పీరియడ్ అవుతూండగా – స్కూళ్లకి, కాలేజీలకీ కూడా – అత్యవసర తాఖీదు ఒకటి కలెక్టరాఫీసు నుంచి వచ్చింది. నగరంలో మర్నాడు ఉదయం యిరవై కిలోమీటర్ల నిడివిగల 'మెగా మానవహారం' కార్యక్రమం ఉంది. దానికి – మినిస్టర్ గారు వస్తున్నారు. మాంచి శారీరదారుఢ్యం గల మగపిల్లలు చక్కగా వున్న ఆడపిల్లలూ – కూడా స్టేడియంలోకి చేరాలి. కాలేజీలకూ, స్కూళ్ళకూ కూడా యిదే రూలు – అంతా టిప్‌టాప్‌గా రావాలి" అన్నది దాని సారాంశం.

జూనియర్ కాలేజీ లెక్చరర్ – లాల్‌బాల్‌పాల్‌కి యిటువంటి ప్రోగ్రామ్స్ అంటే గొప్ప సరదా.

"హలో! ఫ్రెండ్స్!... 'మెగా మానవహారం' ప్రోగ్రామ్‌కి వచ్చేవారంతా – చేతులెత్తండోయ్!"

"అమ్మాయిలు కూడా చేతులెత్తాలా, సార్?" సంతోష్, రాకేష్, అమర్, సమర్, లోకేష్, జగన్, అనూహ్య, ఐశ్వర్య, అమలా, యామిని, అలేఖ్య – యిట్లా చాలామంది లేచారు. అమ్మాయిలు రెండు చేతులూ ఎత్తారు. "వుయార్ రెడీసార్!"

" 'ఉగ్రవాదం' అంటే మీకు తెల్సు"నంటూ మొదలెట్టి–లాల్‌బాల్‌పాల్ – చిన్న లెక్చరిచ్చాడు.

"ఓ.కే... నాలుగు పెయిర్స్ చాలు అన్నారు. కనుక, నువ్వు కూర్చోవోయ్ సంతోష్!– అటు – యామినీ యూ టూ డ్రాప్" అన్నాడు.

టక్కున తొలివరస అమ్మాయి అనూహ్య మొహం చిట్లించి మరీ చతికిలబడ్డది. "అదేమిటోయ్ – అనూ! యామినికి కదా నేను చెప్పానూ... నువ్వు బెస్ట్ అథ్లెట్‌వీ, ప్లస్ కాలేజీ బ్యూటీ నంటావ్...?"

"సారీసర్! సంతోష్ కూడా వస్తేనే, అనూహ్య గోజ్" ఖండితంగా చెప్పింది.

మొత్తం మీద రాకేష్‌తో ఏదో బేరం పెట్టుకొని – సంతోష్ – వాడి జాగాలో దూరాడు లాల్‌బాల్‌పాల్ చూస్తూ వున్నాడేగానీ – ఆ పిల్లలు యిద్దరూ –'ప్రామిస్!' అంటే 'ప్రామిస్' అంటూ, ఏమేమి బేరాలు చేసుకున్నారో అర్థం కాలేదు.

అట్లాగా – స్మార్ట్‌గా వుండే జంటలు మర్నాడుదయం బందరు రోడ్డు మీద 'హరివిల్లు దిగిందా?' అన్నట్లు గుమిగూడారు. లారీలు,జీప్‌లు – పోలీసులు, నాయకులు – టీచర్లు, స్టూడెంట్లూ – అదో రణరంగంలా వుంది. ఉగ్రవాదం – డౌన్‌డౌన్" అంటూ వస్త్రతోరణాలు–మధ్యలో మంత్రిగారి స్వాగతం తోరణాలు కూడా వెలిశాయ్.

అంతా, కలర్‌ఫుల్‌గా – రంగు రంగుల వాటర్‌బాటిల్స్ కూడా పట్టుకుని తయారైనారు. అనూహ్య, సంతోష్ – ఒకర్నొకరు నీడలాగ అనుసరించారు. మానవహారంలో చేతులుజాపి 'సంకెల' వేసి పట్టుకున్నారు. దాని చెవివాడు – వాడి చెవి అదీ 'కొరకడం' చూసి – కనుకుట్టిన వో పోలీసు–"ఆపండయ్యా! సినిమా సీన్లు" అని గదమాయించాడు.

మానవహారం అనే ఆ లైన్‌లైనంతా – అట్లా కొండచిలువలాగ–తాపీగా – ముందుకు సాగుతూ – వూరు శివారుకు చేరింది. స్టేడియం దగ్గర – కొత్త 'మానవులు' – చేరుతున్నారు. లైను కదిలి – జాగా యిస్తున్నది. చూయింగమ్‌లు, చాక్లెట్లు లాంటివి, దవడ విన్యాసాలు చేస్తూనే వున్నాయి. ఎండ ఎర్రగా మరింత వేడిగా మారిపోతోంది.

"ఏయ్! అనూ! మా 'గ్రాండ్‌పా' పొలా లిక్కడే లోనకిపోతే వస్తాయ్... చెప్పానుగా ప్లాను.... అమ్మోరి చెట్టు గుడీ – అక్కడికి చెక్కేద్దాం కంకిపాడు దాటనీ..." అరచేతిలో వేసినచెయ్యి గోకుతూ చెప్పాడు.

"ఓ.కే.. సంతూ మన ప్లాన్ సక్సెస్ అయితేనే యివాళ, వుయ్ గో బ్యాక్ టు హవుస్," అన్నది చున్నీ జారిపోతే తీసివేసుకుంటున్నట్లు నటించి. సంతోష్‌కి ఎక్కణ్ణుంచి పైకి తీసిందో చూయింగ్‌గమ్ అందించి గప్‌చిప్‌న చెయ్యి కలిపింది.

జంక్షన్‌లో లైన్ తెగింది. ఈ జంట మాయమైంది. 'ప్రేమ' అన్న మకుటం వున్న సినిమాలు కుప్పలు కుప్పలు మరోసారి మరోసారి చూసి, చూసి పండిపోయారీ టీనేజర్స్! మధ్యాహ్నం ఎండ వాళ్లకి వెన్నెల్లాగా వుంది. తానో హీరోయిన్, వాడో హీరో.... అమ్మోరి రావిచెట్టు గుడి వాళ్ల గమ్యం. అది సమాధో, అమ్మ వారి గుడో తెలియదు" 'లవర్స్ స్పాట్' అయిపోయింది.

"అదో! అదే, అమ్మోరి రావిచెట్టు – 'లవ్ ట్రీ'! ఆ యిద్దరూ పరుగులు తీశారు. రావిమాను చుట్టూ కాస్సేపు సినిమాల్లోలాగా వాటేసుకున్నారు.

"నీపేరు నేనూ, నాపేరు నువ్వూ" అంటూ, చెక్కడంలో నిమగ్నమైనారు. ఓ కొండవాడు ఒకసారి తాయెత్తు యిచ్చి మరీ, చెప్పాడుట అనూహ్యకి "ప్రేమవివాహం ఖాయం" అని. వాళ్లీ ప్రపంచంలో లేరు తేలిపోతున్నారు.

కళాశాల జంట అక్కడ అలా, బిజీగా వుండగా హైస్కూలు, టెన్త్‌క్లాస్ జంట లవ్‌లీ, భరణీ కూడా మానవహారంలో నుంచి రెండో కంటికి తెలియకుండా జారిపోయారు. మణిహారంలోంచి ఒకే ఒక్క పూసా లాగా మెల్లగా చల్లగా జారుకున్నారు.

'లవర్స్ ట్రీ' గురించి భరణి వాళ్ల బాబాయ్ దగ్గర విన్నాడు. ఆ బాబాయ్ మెడిసన్, ఫస్ట్ ఇయర్‌ట! మంచి లవర్!

లవ్‌లీ, భరణీ రోడ్డు దిగి మండుటెండలో పడి పొలాల గట్లు దాటేస్తున్నారు. "ప్రేమ కోసమే ఎండలో పడెనే పాపం పసివాళ్లూ" అంటూ, నేపథ్యగానం లేదు గానీ ఆకాశంలో గ్రద్దలు కృష్ణా కృష్ణా అంటూ పల్టీలు, గిరికీలు కొడుతున్నాయ్.

"దారితప్పాం కాబోలు.... లవ్లీ!" అంటున్నాడు భరణి.

"ఓ గాడ్! నావల్ల కాదు. నావసలే డెలికేట్ పాదాలు.... పుండ్లు పడతాయేమో భరూ!"

"నేనెత్తలేనమ్మోయ్. నిన్ను నీదసలే ఫైవ్‌స్టార్ చాక్‌లేట్ బాడీ...." అంటున్నాడు టెన్త్ 'ఎ' సెక్షన్ లాస్ట్ బెంచ్ హీరో భరణి.

సరే! ఈ పిల్లకాయల జూనియర్ జంట-'ప్రేమవృక్షం' వెతుక్కుంటూ వుండగా అక్కడ రావిచెంత గుడికి చేరిన సీనియర్ జంట చెట్టు బెరడు మీద పేర్లు చెక్కుకుంటూ చెమటలు క్రక్కుతున్నారు.

"మన పెళ్లి అవుతుందా డాళింగ్?" అడిగింది అనూహ్య అనుమానంగా. మెడలో గొలుసు తడుముకుంటూ.

"ఎందుకవదూ? అవకపోతే, పోనీ మన ప్రేమ వుంటుందిగా.... వో ప్లానుందిలే.... చెన్నైలో మా చింతాత కొడుకు సినిమాల్లో స్టంటు మాస్టరు. అక్కడికి చెక్కేద్దాం.... ప్రేమకోసం ఏ సముద్రంలోనయినా దూకడానికయినా రెడీ అన్నావు కదే..?" అని నవ్వాడు, సంతోష్. సముద్రం అంటే 'బెయమా'?" అన్నాడు మళ్లీ కన్నుగీటి.

వీళ్ల గుసగుసలు అక్కడి అమ్మోరి చిన్న గుడి గట్టు మీద పేకాడు కుంటున్న ఆకతాయిలు గమనించారు. 'లబ్జడిక లబ్జడిక లంబా' అంటూ ఈళ్లనో పట్టుపడదాం.... రాండిరా...." అంటూ, వాళ్లలో ఒకడు, పేకముక్కలు, క్రిందికి దించాడు. అంతే నలుగురూ లేచారు. తుపుక్కున పుగాకు వూశారు.

"ఒరేరోయ్! ఎవుళ్లురా మీరు? నిచ్చేపంలాంటి అమ్మోరి చెట్టు చెక్కేత్తన్నారు గందరా?" అంటూ పాలపిట్టల మీద వాలిన రాబందుల్లాగ దుమికి సంతోష్ షర్ట్ కాలర్ అందుకున్నారు.

కాలేజీ జంట యిట్లా, నిజంగా సినిమా సీను ప్రత్యక్షమయ్యేసరికి బిక్కచచ్చిపోయారు. మాట పెగలదు... చేతులాడవు, కాళ్లు కదలవు!

వాళ్లు జేబులు తడిమారు. రూపాయినోట్లూ, చిల్లరా చూయింగ్ గమ్మూ, సెంటు రుమాలు సహా, అన్నీ సంగ్రహించారు. అమ్మాయి మెడ తడిమి, వీపు నిమిరి మెడలో గొలుసూ, చెవుల రింగులూ 'గోవిందా!' అంటూ ఒకడూ 'బాగుందా?' అంటూ మరొకడు లాగేసుకున్నారు.

అబ్బాయిగారి రిస్టువాచీ కూడా 'గోహూవిందా!' అయిపోయింది. పైగా చెంప ఛెళ్లుమంది.

సంతోష్‌వి సినిమా తెలివితేటలు. బండితాళాలు మాత్రం క్రింద, కనబడ కుండా పారేశాడు.

వాళ్లు బండ జోకులు వేస్తున్నారు. 'బళ్లోకి పోయి బాగా సతకండిరా నా ..... అంటే గుళ్లోకొచ్చి బజ్జుంటార్రా? నాయాళ్లల్లారా... సినిమా యీరో, యీరోయిన్లా మీరూ?" అంటూ నిలువుదోపిడీ చేసేశారు.

ఓ తాడు సంపాదించుకొచ్చారు. వీళ్లని గుడిలోపలికి గొరగొరా లాక్కొచ్చి చిన్నమండపం స్తంభానికి యిద్దర్నీ గట్టిగా కట్టిపడేశారు. సంతోష్ చేతిరుమాల్నే ఛర్రున రెండుగా చీల్చి "లవ్వాటలాడతార్రా.... లవ్వాట? ఇప్పట్నుంచే, లవ్వు కావాలట్రా?" అంటూ ఇద్దరినోళ్లూ తెరిపించి ఆ గుడ్డలు క్రుక్కేశారు.

"ఇక ప్రేమించుకోండిరా...." అంటూ, దోచుకున్నవి అన్నీ మూటకట్టి - 'కరోకరోజరజల్సా' అంటూ, కేరింతలు కొడుతూ - "ప్రేమజంటకీ బై-అమ్మోరికీ జై" అంటూ జారుకున్నారు.

నోరు లేదుగా అంచేత కళ్లతోనే, కన్నీళ్లతోనే "అమ్మా! తల్లీ అమ్మోరూ!" అంటూ, ఆవేదనగా చూశారు. చిన్నిగుడి తలుపులకి పెద్ద తాళం కప్ప వేళాడు తోంది. అంచేత అమ్మోరు ఉలకలేదు, పలకలేదు. సినిమాల్లోలాగా ఏ గొర్రెల కాపరీ అటు రాలేదు.

ఈలోగా జూనియర్ లవ్‌బర్డ్స్ భరణీ, లవ్‌లీ పడుతూ లేస్తూ రావిచెంత గుడి దెగ్గరికి చేరుకున్నారు. 'ఐలూ' అని చెక్కుదాం...:. భయంగా వుంది. కాళ్లు తీపులు పేరంతా చెక్కడం కష్టంరా భరూ!" అంది, లవ్‌లీ.

"నువ్వేంగాల్‌ఫ్రెండ్‌వే? నా పేరే పూర్తిగా చెక్కలేవు. రేపు నాతో ఎట్లా చెక్కేస్తావ్, లవ్‌లీ? నేనే చెక్కుతాలే మన యిద్దరి నేమ్సూ" బ్లేడూ, చాకూ అన్నీ తీసి రెడీ అయ్యాడు. "ఓసారి యీ గాడెస్‌ని తలుద్దాం" అంటూ గుడి తలుపు దిశగా తిరిగాడో లేదో స్తంభానికి కట్టివున్న 'జంట' ముక్కుతూ, మూలుగుతూ కనబడ్డారు.

బ్యార్‌మన్నాడు హీరో భరణి. 'బాబోయ్' అంటూ వాణ్ణి చుట్టేసుకుంది లవ్‌లీ. పరిగెట్టాలీ అంటే కాళ్లు తిమ్మిరెక్కిపోయాయి. వణుకు పుడుతోంది యిద్దరికీ. ఈలోగా, సంతోష్ గుంజుకుని, గుంజుకుని నోటవున్న గుడ్డని క్రక్కేశాడు.

"మేం.. మేం ఫ్రెండ్స్‌మి.. రాండి.. ప్లీజ్... ప్లీజ్ హెల్పజ్.. వుయ్ విల్ హెల్ప్‌యూ" అన్నాడు, ఎండిపోయిన గొంతుతో సంతోష్ అసంతోషంగా.

ధైర్యం ముఖ్యం ప్రేమికులకి. అందుకనే, లవ్‌లీ, భరణీ యీ సీనియర్ జంటని తప్పనిసరిగా అతికష్టం మీద బంధవిముక్తుల్ని చేశారు. పేర్లు చెక్కడానికి తెచ్చుకున్న కత్తీ, బ్లేడూ యిందుకు పనికొచ్చాయ్!

శోషెత్తిపోయారు పిల్లకాయలు.

అంతలో సంతోష్‌ని పోల్చిన భరణి - 'మామయ్యా!' అంటూ వాటేసు కున్నాడు.

"అరే.... యిదేంట్రా.... నువ్వా భరణీ" అంటూ, వరస మేనల్లుణ్ని గుండెల్లో పొదువుకున్నాడు సంతోష్.

"ఏం మాయదారి రోగంరా? యింత గొద్దుపిల్లకాయలూ! మా మీద 'స్పయి'ల్లాగ తగలడ్డారూ...." అంటూ, చిర్రుబుర్రులాడింది అనూహ్య. సంతోష్ వేపు తిరిగి -

"మా నాన్న వీపు చీరేస్తాడు డాళింగ్! విలన్ లాంటోడు. యీ కుర్ర నాయాళ్లు చెప్పేస్తారేమో నాకు భయంగా వుంది" అంది.

లవ్‌లీకి గ్రుక్కిళ్ళు గ్రుక్కిళ్లుగా వచ్చేస్తోంది దుఃఖం. "బీకామ్, అయ్‌సే.... మనం అంతా లవర్స్‌మి. వీడు నా శిష్యుడు. వాడి గుట్టు నా దగ్గరుంది. కనుక, మన గుట్టు వాడి దగ్గరే వుంటుంది. అంచేత నో ప్రాబ్లెమ్... సో... లెటజ్ కోఆపరేట్.... అల్లుడూ! మా గురించి, నోరిప్పావో నీ గురించి అంతా కక్కేస్తా. మా అక్కయ్యకి నీ లవ్ అఫ్ఫైర్ సెవెన్టీ ఎమ్.ఎమ్.లో చెప్పేస్తా. ఖబడ్దార్... పదండి.... పదండి" అంటూ, లవ్‌లీ నెత్తిమీద సుతారంగా ఒకటి అంటించాడు.

"రోడ్డెక్కాక ఆటో ఎక్కిస్తాలే మై యంగ్ డాళింగ్!" అన్నాడు.

హీరోలాగా "ఓ.కే....డన్" అంటూ చెయ్యిచ్చాడు బాలుడు. అందు కున్నాడు యువకుడు హీరో ఫోజులో. నలుగురూ కాళ్లీడ్చుకుంటూ వాలుతున్న చీకటితెరల మధ్య నుంచి సిటీలైట్ల వైపు దారితీశారు.

లవర్స్‌కి 'గట్స్' వుండాలి మరి!

"ఎన్నిమ్యాటనీలో, ఎన్ని పార్కుషైర్లో... ఎప్పుడూ యిలా అవలేదు మరి. ఈ అమ్మోరిని నమ్మకూడదు. యీపాటికి 'డాడీ' వో పోలీసోణ్ణి వెంట పెట్టుకుని వచ్చినా వచ్చేస్తాడు. లగెత్తండెహే... మా పీకల మీదికి, మీరొకళ్లూ..." అంటూ, ఓ జంట దిక్కులు చూస్తున్నాడు ఇండస్ట్రియలిస్ట్ సోంబాబుగారి ముద్దుల సుపుత్రుడు సంతోష్!

అనుకున్నంతా అయింది. ఓ కారు హెడ్‌లైట్లు ఆర్పేసి మరీ వచ్చి ఆగింది. అందులోనుంచి సోంబాబు, పోలీసు కానిస్టేబుల్ కూడా దిగారు.

బాలుడు పరిగెత్తాడు. బాలిక 'బాఁ'మని ఏడుపందుకుంది. "మీకేం రోగంరా? అయినా మీ అమ్మానాన్నల కాడికే ఎళ్దాం ఆగండి" అంటూ పట్టు కున్నాడు టెన్త్‌క్లాసు లవ్‌బర్డ్స్‌ని సోంబాబు. "ప్రేమా? చట్టుబండలా? ఇదో మాయదారి రోగం" అంటున్నాడు పోలీసోడు.